# సుబ్బారావు సమయస్ఫూర్తి

-వాణిశ్రీ

సుబ్బారావు టి.వీలో న్యూస్ చూస్తున్నాడు. విజయ ముస్తాబు పూర్తి చేసుకుని పెళ్ళికి వెళ్ళడానికి సిద్ధమైంది. అప్పుడు రాత్రి తొమ్మిదైంది. సుబ్బారావు గంటక్రితమే భోజనం చేశాడు. అతనికి కడుపుమంట జబ్బుంది. ఇంగ్లీషులో గ్యాస్ ట్రబుల్ అంటారు. పెందలాడే భోజనం చేసి యాంటాసిడ్ ట్యాబ్లెట్లు చప్పరిస్తేగాని కుదుటపడడు. ఈ గొడవంతా దేనికని రాత్రిళ్ళు జరిగే పెళ్ళిళ్ళకి వెళ్ళడం మానుకున్నాడు.

"నేనిక బయల్దేరుతున్నా! లోపల బోల్టు వేసుకోండి" అన్నది విజయ.

సుబ్బారావు గుర్రుగా చూశాడు. ఆ పెళ్ళి అర్ధరాత్రి. ఇంటికొచ్చేసరికి ఏ రెండో, మూడో అవుతుంది. అప్పుడు వచ్చి బజ్జర్ మోగించి డిస్టర్బ్ చేస్తుందన్నమాట. మధ్యలో మెలకువ వస్తే చస్తే నిద్ర పట్టదు సుబ్బారావుకి.

"అర్ధరాత్రి మద్దెల దరువులా నువ్వు డిస్టర్బ్ చెయ్యకు. బైట తాళం వేసుకుని వెళ్ళు. నువ్వెప్పుడొచ్చినా బాధలేదు" అన్నాడు సుబ్బారావు.

విజయకు మండింది. అసలే సుబ్బారావు మీద కోపంగా వుంది. బ్యాంక్ లాకర్లో ఉన్న వడ్డాణం తెమ్మంటే తేలేదు.

చుట్టాల పెళ్ళంటే సరే! ఇరుగుపొరుగు వాళ్ళ పెళ్ళిళ్లకు కూడా వడ్డాణాలూ, వంకీలు పెట్టుకోవడం అవసరమా? అని మండి పడ్డాడు.

కానీ, విజయకు అసంతృప్తిగా ఉంది. ఎన్ని నగలు పెట్టుకున్నా వడ్డాణం కళే వేరు అనేది ఆమె అభిప్రాయం.

సుబ్బారావు మొండి మొగుడు. డిక్టేట్ చెయ్యడమే తప్ప ఒకరు చెప్తే వినే రకం కాదు. ఈ విషయం మొదటి రాత్రే గ్రహించి సర్దుకుపోతోంది విజయ.

"తాళం వేసుకుని వెళ్ళనా? బాగుంది. తాళం చెవి ఎక్కడైనా పారేసుకుని వస్తే?" అన్నది.

"దాందేముంది? బండరాయి తీసుకుని పగలగొట్టు" కసిగా అన్నాడు సుబ్బారావు.

"హూ..!" అనుకుంటూ విజయ తలుపులు ధడాలున వేసి తాళం పెట్టింది.

★ ★ ★

సుబ్బారావుకి నిద్రాభంగమైంది. కళ్ళు తెరిచి చూశాడు.

తనపక్కన భార్య లేకపోవడంతో అతనికి ఆమె పెళ్ళికి వెళ్ళిందన్న సంగతి జ్ఞాపకం వచ్చింది.

టక్..టక్...మని శబ్దం వస్తోంది. ఎవరో తాళం పగలగొడుతున్న చప్పుడు.

'హూ..అనుకున్నంతా అయిందన్నమాట కీ ఎక్కడో పారేసి వుంటుంది. ఇక గత్యంతరం లేక తాళం పగలగొడుతున్నట్లుంది' అనుకున్నాడు.

తలుపులు నెమ్మదిగా తెరుచుకున్నాయి. పట్టుచీర రెపరెపలు, సెంటువాసన రావడంలేదు. ఎవరో ఇద్దరు నడుస్తున్న చప్పుడు వినిపించి సుబ్బారావు గుండె గుభేలుమన్నది. 'కొంపదీసి దొంగలేమో' అనుకున్నాడు.

ఔను దొంగలే!

"అరె..ఇంట్లో మనిషున్నాడ్రోయ్!" గుసగుసలాడుతున్నట్లు అన్నాడు.

"తాళం వేసుంటే ఎవరూ లేరనుకున్నాం. పారిపోదామా?"

"ష్! పారిపోవడం ఎందుకురా? ఎటూ వచ్చాం. ఏం దొరికితే అది దొరుకుతుంది. వీడిని లేపి తాళాలెక్కడున్నాయో అడుగుదాం"

సుబ్బారావు బిర్ర బిగుసుకుపోయాడు. చచ్చినవాడిలా వుండిపోయాడు. ముఖంమీద వెలుగుపడింది. టార్చిలైటు వేశారన్నమాట.

"ఏయ్!..లేవవయ్యా!"

సుబ్బారావు కళ్ళు తెరిచి లేచి కూర్చున్నాడు.

"ఎవరు..విజయా?" అన్నాడు.

"విజయు కాదు వంకాయు కాదు. దొంగలం..."

"దొంగలా?" అని పకపక నవ్వాడు సుబ్బారావు.


దొంగలు ఒకరి ముఖం మరొకరు చూసుకున్నారు. వీడెవడండీ బాబూ! దొంగలంటే భయపడకుండా, అదేదో జోక్‌లా నవ్వుతున్నాడు.

"ఏయ్! నవ్వుతావేందయ్యా! పిచ్చి పిచ్చిగా ఉందా? మర్యాదగా బీరువా తాళం ఇవ్వు" కరుకు కంఠంతో అన్నాడు దొంగ.

సుబ్బారావు పకపక నవ్వుతూ లేచి లుంగీ సర్దుకున్నాడు. ట్యూబు లైటు వేసి దొంగల వైపు చూశాడు. ముదురు దొంగలు కాదు. పాతికేళ్ళ లోపు కుర్రాళ్లే. ట్రైనింగ్ పిరియడ్‌లో ఉన్నట్లున్నారు.

"తాళాలివ్వమంటే నవ్వుతావేందయ్యా?" అన్నాడు దొంగ.

"నవ్వక..ఏడవమంటావా? ఆ తాళాలుంటే ఇక్కడెందుకుండేవాడిని? హాయిగా క్లబ్బుకెళ్లి



పేకాడుతూ ఉండేవాడిని''

దొంగలు వెర్రిమొఖం వేశారు.

"మీకు అసలు సంగతి తెలీదుగదూ? సరే పదండి. హాల్లోకి వెళ్ళి మాట్లాడుకుందాం'' అంటూ హాల్లోకి నడిచాడు సుబ్బారావు.

తను సోఫాలో కూర్చుని, వాళ్ళనీ కూర్చోమన్నాడు.

"మీకు ఆశ్చర్యంగా ఉంది కదూ! తాళం పగలగొట్టుకుని లోపలకొస్తే మనిషి ఉన్నాడేంటని?''

దొంగలు తల ఊపారు.

"ఖర్మ! ఏం చేస్తాం? ఇంతకీ నా కథ వింటే మీక్కూడా జాలి కలుగుతుంది. నా భార్య సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. లక్ష రూపాయల జీతం. నాకు ఒకప్పుడు ఉద్యోగం ఉండేది. ఆ కంపెనీ దివాళా ఎత్తింది. ఉద్యోగం ఊడింది. అప్పట్నుంచీ నా భార్య చిన్నచూపు చూస్తోంది. నేను టార్చర్ భరించలేక క్లబ్బులో తాగడం, పేకాడ్డం మొదలుపెట్టాను. ఇక అప్పట్నుంచి డబ్బు దొరకకుండా జాగ్రత్త పడుతోంది. ఆఖరికి సిగరెట్లకి కూడా ఇవ్వడం లేదు'' సుబ్బారావు హీనస్వరంతో చెప్పాడు.

దొంగలకు సుబ్బారావు మీద జాలి కలిగింది.

"బ్రదర్! సిగరెట్టుంటే ఇవ్వవా?'' అడిగాడు సుబ్బారావు.

ఒక దొంగ జేబులో నుంచి సిగరెట్ ప్యాకెట్ తీసిచ్చాడు. సుబ్బారావు ఒక సిగరెట్ తీసుకుని తిరిగి ఇవ్వబోతుంటే...

"ఫరవాలేదు ఉంచుకోండి పాపం...'' అన్నాడు దొంగ.

సుబ్బారావుతోపాటు ఆ దొంగలిద్దరు కూడా మాట్లాడకుండా సిగరెట్లు వెలిగించారు.

"మందు లేదు, పేకాట లేదు, సిగరెట్లు లేవు. ఒక్క సరదా లేదు. ఎందుకీ పాడు జీవితం. నాకు ఒక్కోసారి చచ్చిపోవాలనిపిస్తోంది. '' అన్నాడు సుబ్బారావు.

"పాపం''

"ఇదుగో బ్రదర్స్! దేవుళ్ళలా వచ్చారు. నాకో సాయం చెయ్యండి. బీరువాలో లక్ష రూపాయలున్నాయి. మీరెలాగైనా పగలగొట్టి అందులో ఏభైవేలు నాకివ్వండి. మీరిద్దరూ చెరి పాతిక వేలు తీసుకోండి'' అన్నాడు సుబ్బారావు.


"అన్యాయం! మాకు పాతిక వేలా? నీకు ఏభై వేలా?'' గట్టిగా అన్నాడు దొంగ.

"పోనీ..నాకు నలభై, మీకు అరవై'' బేరం పెట్టాడు సుబ్బారావు.



## పెళ్లి బాజాలు

ఆదిత్య చోప్రా- రాణీముఖర్జీల ప్రేమాయణం గురించి దాదాపు ఐదేళ్లుగా బాలీవుడ్‌లో వినిపిస్తూనే వుంది. రాణీ వల్లనే ఆదిత్యకి భార్యతో గొడవలొచ్చి అది విడాకుల దాకా దారితీసిందనేది ఓ కథనం. ఏదేమైతేనేం రాణీ ముఖర్జీ-ఆదిత్యల పెళ్లి ఈ ఏడాది నవంబర్‌లో కచ్చితంగా జరగబోతోందని అంటున్నారు సినీజనాలు. ఆ పెళ్లికి సంబంధించిన ఏర్పాట్లు అప్పుడే మొదలయ్యాయని కూడా చెప్పుకుంటున్నారు. సినిమాల్లోకి రాణీ వచ్చి దాదాపు దశాబ్దం దాటుతోంది కాబట్టి ఇక పెళ్లిచేసుకుని ఇల్లాలుగా మారుతుందేమో!




"కుదరదు. మాకు డెబ్భై..నీకు ముప్పై...!''

"డన్..'' అని లేచాడు సుబ్బారావు.

"ఎక్కడికి?'' అడిగాడు దొంగ.

"వంట గదిలో సుత్తి, స్క్రూ డ్రైవర్ వగైరా ఉన్నాయి. అవి మీకు ఇస్తాను'' అన్నాడు సుబ్బారావు.

"అవసరంలేదు. అటువంటివి మా దగ్గర ఉన్నాయి'' అన్నాడు.

"ఓ.కే. కానివ్వండి'' అని సుబ్బారావు బీరువా ఉన్న రూమ్‌లోకి తీసుకెళ్ళాడు.

"ఇది గోద్రేజ్ కంపెనీ బీరువా! బాగా స్ట్రాంగని మా మావ కొనిపెట్టాడు. ఎట్లా తీస్తారో..ఏమో?'' అన్నాడు సుబ్బారావు.

"రాక ఏం చేస్తుందిగాని, కొంచెం టైం పడుతుంది''

"తొందరగా పని కానివ్వండి. మా ఆవిడ పెళ్ళికి వెళ్ళింది. అది వచ్చే లోపల పూర్తి చెయ్యాలి'' సుబ్బారావు తొందరపెట్టాడు.

దొంగలు తల ఊపారు.

దొంగలిద్దరూ పనిలో పడ్డారు.

సుబ్బారావు ఫ్రిజ్ తెరిచి కూల్‌డ్రింక్ సీసా వంచి చెరొక గ్లాసులో పోసి వాళ్లకు ఇచ్చాడు. వాళ్ళు ఆ గ్లాసు తీసుకోకుండా అతన్ని అనుమానంగా చూశారు.

"ఏంటి చూస్తున్నారు? నేను ఇందులో ఏదైనా మత్తు పదార్థం కలిపాననా?'' అని సీసా ఎత్తి గట గట తాగాడు.

సుబ్బారావు నవ్వాడు.

"ఇప్పుడు నమ్మకం కుదిరిందా?'' అన్నాడు.

వాళ్ళు తలవూపి తాగడం మొదలుపెట్టారు.

"నేను చాలా సిన్సియర్ ఫెలోని. నేను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మక ద్రోహం చెయ్యను. ఇప్పుడు మీరు నాకు పార్ట్‌నర్స్. మిమ్మల్ని మోసం చేసే ఉద్దేశ్యం లేదు. ఎందుకంటే మీ అవసరం నాకు చాలా ఉంది. డబ్బుల్లేక అల్లాడిపోతున్నాను. మందు తాగి ఎన్నాళ్ళయ్యిందో? మా ఆవిడ నాకు తిండే దండగ అంటోంది. ఇక మందుకి డబ్బులిస్తుందా?'' సుబ్బారావు చెప్పుకుపోతున్నాడు.

వాళ్ళిద్దరూ సుబ్బారావుని జాలిగా చూస్తూ పనికానిస్తున్నారు.

"మీరెవరైనా బాత్‌రూమ్‌కి వెళ్ళే అవసరం ఉందా?'' అడిగాడు సుబ్బారావు.

లేదని తల అడ్డంగా ఊపారు దొంగలు.

"నాకేమిటో కూల్‌డ్రింక్ తాగితే చాలు బాత్‌రూమ్‌కి వెళ్ళాల్సి వస్తోంది. నేను బాత్‌రూమ్‌కి వెళ్ళొస్తాను. మీరు జాగ్రత్తగా పని కానివ్వండి. మా ఇంటికి అటాచ్‌డ్ బాత్‌రూం లేదు. ఇంటి వెనుక వుంది'' అంటూ వెళ్ళాడు సుబ్బారావు.

ఐదు నిమిషాల తర్వాత వచ్చాడు.

వాళ్ళిద్దరూ బీరువా తెరవడానికి తంటాలు పడుతున్నారు.

"లోకల్ మేడ్ బీరువా అయితే తొందరగా వచ్చేది. గోద్రేజ్ కంపెనీది కష్టమే!'' అన్నాడు ఒక దొంగ.

"మా మావ చెప్పింది నిజమేనన్నమాట'' అన్నాడు సుబ్బారావు.

దొంగ తల ఊపాడు.

"మనకి లక్ లేదనిపిస్తోంది'' అన్నాడు సుబ్బారావు.

"ఏంటి సార్! బీరువా తాళం తియ్యలేమని డౌట్ పడుతున్నారా?'' కోపంగా అన్నాడు దొంగ.

"అదికాదు. మా ఆవిడ పెళ్ళికి వెళ్తూ ఇంట్లో వున్న నగలన్నీ పెట్టుకు వెళ్ళింది. లేకపోతే మీకు బోలెడు గోల్డ్ దొరికేది కదా?'' అన్నాడు సుబ్బా

రావు జాలిగా వాళ్లవంక చూస్తూ.

"చూస్తుంటే భలే తెలివి తక్కువోడిలా ఉన్నారే మీరు" అన్నాడొక దొంగ.

"వాట్?" అని అదిరిపడ్డాడు సుబ్బారావు.

"లేకపోతే ఏంది సార్! మీ ఆవిడ పెళ్ళికెళ్తూ మిమ్మల్ని లోపలపెట్టి తాళం వేసి వెళ్ళింది కాబట్టి మేము తాళం పగలగొట్టి వచ్చాం. లేకపోతే వచ్చేవాళ్ళం కాదుగదా?" రీజనింగ్ తీశాడు దొంగ.

"ఔను కదా!" అని ఒక వెర్రి నవ్వు నవ్వాడు సుబ్బారావు.

"వట్టి చచ్చు దద్దమ్మలాగున్నాడే ఈయన?" అని గుస గుసలాడుతూ గొణుక్కున్నారు.

సుబ్బారావు ఒక కుర్చీలో కూర్చుని వాళ్ళు చేసే పని అబ్జర్వ్ చేస్తున్నాడు.

"అన్నా! వీడికి ముప్పై వేలు ఇవ్వాలంటావా?"

"ఏంది ఇచ్చేది బొచ్చు? డబ్బు దొరికాక నోట్లో గుడ్డలు కుక్కి, కట్టేసి పోదాం"

"పోన్లే అన్నా! పదివేలు ఇచ్చిపోదాం"

"వేస్ట్! ఎందుకంటే వీడి పెళ్లాం వచ్చాక ఊరుకుంటుందా? లాక్కుంటుంది. వీడికి ఇస్తుందనుకున్నావా?"

"అట్లా కాదులే! ఎక్కడైనా దాచుకుంటాడు ఆవిడ వచ్చేలోపల"

"సరే! చూద్దాంలే. ముందు పని కానీయ్!"

ఇంతలో తలుపు చప్పుడైంది.

అంతా ఉలిక్కిపడ్డారు. సుబ్బారావు ముఖంలో భయం తొంగి చూసింది.

"మా ఆవిడ వచ్చినట్లుంది? ఇప్పుడెట్లా?" సుబ్బారావు వణుకుతూ అన్నాడు.

"ఇప్పుడప్పుడే రాదన్నావుగా?" అన్నాడు దొంగ.

"ఏమో! వచ్చిందిగా! ఏం చేద్దాం?" అన్నాడు సుబ్బారావు.

"అంతా మన మంచికే. మీరు ఇక్కడే ఉండండి. మేము తలుపు తీసి ఆవిడ నోరుమూసి కట్టేస్తాం. బీరువా తాళాలు గూడా ఆవిడ దగ్గరే ఉంటాయి కనుక గొడవలేదు. పనిలో పని నగలు కూడా లాక్కుని కట్టేస్తాం" అన్నాడు దొంగ.

"బాగానే ఉందిగానీ... మరి నా భాగం ఎప్పుడిస్తారో చెప్పండి ముందు? మా ఆవిడ చూస్తుండగా ఇవ్వడం బాగుండదు గదా?" అన్నాడు సుబ్బారావు.

"మీ ఫోన్ నెంబరివ్వండి. తర్వాత మేము మీకు ఫోన్ చేస్తాం. మేం చెప్పిన చోటుకి వస్తే మీ భాగం మూడోవంతు ఎంత వస్తే అంత ఇస్తాం... సరేనా"

"నగలు అమ్మిన దాంట్లో కూడా ఇవ్వాలి" అన్నాడు సుబ్బారావు.

"తప్పకుండా!"

"మాట తప్పగూడదు. ఒట్టేయండి" అంటూ సుబ్బారావు చెయ్యి చాచాడు.

వాళ్ళిద్దరూ చేతిలో చేతులు కలిపారు.

దొంగలు ముసి ముసి నవ్వులు నవ్వుకున్నారు సుబ్బారావు అమాయకత్వం చూసి.

దొంగలు ఇద్దరూ తలుపు దగ్గరకు వెళ్ళారు. ఇద్దరూ ఎలర్టుగా ఉన్నారు.

తలుపు చప్పుడవుతోంది. బజ్జర్ శబ్దం చేస్తోంది.

"నేను బోల్టు తియ్యగానే ఆవిడ లోపలకు వస్తుంది. నువ్వు నోరు మూసెయ్. తర్వాత నేను తలుపులు మూసి కదలకుండా పట్టుకుంటాను" గుసగుసలాడుతూ చెవిలో చెప్పాడు ఒక దొంగ మరొకడితో.

అతను తల వూపాడు.

దొంగ తలుపు తీశాడు.

నల్లగా నిగనిగలాడుతూ రివాల్వార్ ముందుకు వస్తోంది. ఆరడుగుల ఎత్తున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేతిలో వుంది అది.

దొంగలు షాక్ తిన్నారు.

బిలబిలలాడుతూ నలుగురు కానిస్టేబుల్స్ లోపలకు వచ్చి ఆ దొంగలి ద్దర్నీ పట్టుకుని చేతులు విరిచి కట్టారు. ఆ దొంగలను తిడుతూ వ్యాన్ ఎక్కించారు.

సుబ్బారావు లోపలనుంచి వచ్చి ఇన్‌స్పెక్టర్‌కి విష్ చేసి కరచాలనం చేశాడు.

★



## ద్వీప సముదాయం ఫిన్లాండ్

ప్రపంచంలో సముద్రంలో ద్వీపాలతో కూడిన దేశాలు చాలా ఉన్నాయి. కానీ వీటన్నిటికీ భిన్నంగా దాదాపుగా 1,79,584 ద్వీపాలతో కూడిన అతి పెద్ద ద్వీప సముదాయమైన దేశంగా ఫిన్లాండ్ ప్రసిద్ధికెక్కింది.

-తటవర్తి

